కథా నిలయం
4952
శ్రీకాకుళం

# అతని కలలు

నిన్న రాత్రి వో కల వచ్చింది.

పేరు తెలియని దేశం. నేనెప్పుడు చూడని దేశం. చుట్టూ కొండలు. ఆ కొండలు నల్లనివో యెర్రనివో పచ్చనివో కాదు.

నీలపుకొండలు. నీలిమేఘాలు గుంపులుగుంపులుగా వుప్పలగుప్పలు తిరుగుతున్నట్టు కొండలు. ఆ కొండల మీంచి నేనలా దిగి వస్తుంటే శీతాకోక చిలకల గుంపు యెదురయింది. భుజాల మీద, కుడిబుగ్గ మీద యెద మీద వాలిన శీతాకోకలు. వూదారంగుపూలు పుప్పొడి వెదజల్లాయి. యింకాస్త దూరం వచ్చానో లేదో యెదురుగా ఆకాశమేమో అనిపించేంత విశాలసముద్రం. అంతెత్తు కొండ మీంచి సముద్రాన్ని చూస్తే కళ్ళు తిరగలేదు. సముద్రం వైపు పరుగులాంటి నడకతో పరిగెత్తాను. కొండ మీద ఆఖరి అడుగు.

మృదువైన యిసుక.

పిల్లల కేరింతలు. చిన్నిచిన్ని సైకిళ్ళ మీద తిరిగే పిల్లలు చెట్టాపట్టాలేసుకొని. పరుగులు తీస్తున్న యువతీయువకులు. యీతకొట్టేవారు ఆ వేకువలో యిసుకలో పడుకొని సూర్యోదయం కోసం చూస్తున్నవారు. ఆనందం తప్ప విషాదం తెలియని రసరమ్యదేశం.

'దేశమా నీ పేరేమి'

నానడుము చుట్టూ చేతులు వేసి దగ్గరగా హత్తుకొంటూ నా కళ్ళల్లోకి మోహపు చూపులు గుచ్చుతు 'ప్రేమ' అని చెప్పాడు.

బోల్డంత ప్రేమేసింది.

అతని పెదవులను ముద్దు పెట్టుకున్నాను.

అందుకే నాకు రాత్రులంటే యిష్టం.

రాత్రి నిద్ర యిష్టం.

ఆ నిద్రలో వచ్చే కలలంటే యిష్టం.

నిన్న రాత్రి వో కల వచ్చింది.

పేరు తెలిసిన దేశం. నేనుంటున్న దేశమే.

నడివీధిలో బహిరంగ తులాభారం.

వో వైపు కులమత వర్గ లింగ వయో భేదం లేకుండా మనుష్యులు. మరో వైపు డబ్బుల కాగితాలు. చూస్తుండగానే వాళ్ళంతా యంత్రాలుగా రహదారులుగా ఆనకట్టలుగా భవనాలుగా మందులుగా ప్లాస్టిక్ మొక్కలుగా మారిపోతున్నారు. డబ్బుల కాగితాలు పంచుకుంటున్న వాళ్ళలో వో తెలిసిన ఆకారం నా దగ్గరకి వస్తోంది. చాల దగ్గరికి. నా చేయి అందుకొని వడివడిగా నడుస్తోంది. నేను నడవటంలేదు. కాని ఆ ఆకారం వెంటే నా శరీరం.

పెద్ద భవనం.

లోపలికి రాగానే నా చేతిని వదిలేసింది. ఆ విశాలమైన యింట్లో యెటో మాయమయిపోయిందా ఆకారం. వెతుకుతున్నా...వెతుకుతున్నా యెవ్వరు కనిపించటం లేదు. ఆ భవనంలో మరో మనిషి కాదు కదా చీమ దోమ కూడా కనిపించటం లేదు. వెతుకుతునే వున్నాను. వో వైపు అరుపులు. నవ్వులు. చప్పుళ్లు. అటు పరిగెత్తాను. తలుపులు వేసున్నాయి. లోపల్నుంచి గొడవ గొడవ. ఆ నిశ్శబ్దంలో ఆ గొడవ నాకెంతో శక్తిని యిచ్చింది. తలుపులు బాదాను. బాదగాబాదగా తెరుచుకున్నాయి. తెలిసిన ఆకారం వెనక మరిన్ని ఆకారాలు. యేమిటో వాళ్ళంతా వొక్కలానే వున్నారు.

'నీ బెడ్‌రూం అది. యిది నాది' అంది ఆ ఆకారం.

తలుపులు మూసేసుకున్నారు.

కొత్త. వొంటరితనం. భయం.

మూసుకున్న తలుపుల దగ్గరే కూలబడి బిగ్గరగా యేడుస్తున్నాను. నా యేడుపుకి నా మెడనరాలు కంటిపాప నరాలు చిట్లి ధారాపాతంగా రక్తం కారిపోతోంది. కానీ నా యేడుపు నాకు వినిపించటం లేదు, కళ్లు కనిపించటం లేదు. వొంటరితనమా?! కాదు కాదేమో. అవునేమో. సమూహంలోనూ లేనా? నేనెలా వున్నాను? యెలా వున్నాను?

అందుకే నాకు రాత్రులంటే భయం. రాత్రి నిద్రపోవటం అంటే భయం. నిద్రలో వచ్చే కలలంటే భయం.

* * *

'ఆయన మిమ్మల్ని వేధిస్తున్నారా? అంటే తాగి వచ్చి గొడవ చేస్తున్నారా?' నల్లకోటు ఆకారం అడిగాడు.

'లేదు' చెప్పాను.

'డబ్బు తీసుకురమ్మంటున్నారా?'

'లేదు'

'మాటలతో నొప్పిస్తున్నారా?'

'నాతో మాట్లాడనే మాట్లాడడు'

'శారీరకంగా హింసిస్తున్నారా?'

'మాకు వేరేవేరే గదులున్నాయి'

'మీరు అడిగింది కాదంటున్నారా?'

'నేనేం అడగలేదు'

'మరెందుకని అతని నుంచి విడిపోవాలనుకుంటున్నారు?'

'వుండాలని లేదు'

'యెందుకని?'

'భయంకరమైన కలలు వస్తున్నాయి'

'కలలకి విడిపోటానికి యేం సంబంధం? మీరు తొందరపడుతున్నారు అతనికి మంచి భవిష్యత్తు వుంది'.

'అంటే?'

'అతను తను కావాలనుకున్నది సాధించగలడు. చాల తెలివైనవాడు'

'అయితే యేంటట?'

'అతని అభివృద్ధిని చూసి భార్యగా మీరెంతో సంతోషపడొచ్చు గర్వపడొచ్చు' అంది నల్లకోటు.

అతని అభివృద్ధి చూసి సంతోషపడాలా? వొకప్పుడు సీతాకోక చిలుకలు, పద్మాలు కలలోకి వచ్చేవి. యిప్పుడు రక్తం గాజు పెంకులు వస్తున్నాయి.

'మీరు తిరిగి అవే మాటలు మాట్లాడుతున్నారు. కలలు అంటారేంటి? అతని పరిచయం కోసం స్నేహం కోసం చాల మంది పాకులాడుతుంటారు. అటువంటిది మీరు అతనికి భార్య. మీకంటే అతనిని దగ్గరగా మరెవ్వరూ యెరగరు. అలాంటి వృద్ధిలోకి వస్తున్న ప్రముఖునికి దగ్గర వ్యక్తిగా వుండటం మీ అదృష్టం. మీ అదృష్టానికి యెందరో అసూయపడుతుంటారు' అంది నల్లకోటు.

వాళ్ళంతా అతనితోనే వున్నారుగా. వుండనీయండి - నేనొక్కదాన్ని వెళ్లిపోతే యేమవుతుంది. అతనికి దగ్గరగా వుండేంత అదృష్టాన్ని నా గుండె మోయలేదు. నాది చాల చిన్ని గుండె. పాపమా గుండె పిచ్చిది. ఆ గుండె యింతటి అదృష్టాన్ని భరించలేదు పగిలి చస్తుంది. యేదో పాపం శీతాకోకచిలుకల్ని వానచినుకుల్ని పారిజాతాలని చూసి గలగలానవ్వుతుంది పిచ్చిది పాపం వదిలైరాదా... ఆ గుండెని అలా....

'అతను నుంచివాడు యెవరే సహాయం అడిగినా కాదనకుండా చేస్తాడు'

అవునట.

'మరి అంత మంచి వ్యక్తి నుంచి మీరెందుకు విడిపోవాలనుకుంటున్నారు' అడిగింది నల్లకోటు.

నేను యే పురాణకాలంలోనో పుట్టివుంటే ఆ మంచితనాన్ని గానం చేస్తు మరింత పాతివ్రత్యాన్ని పాటించి సకలదేవతలు మునులు దేవుళ్ళ నుంచి వరాలు పొంది వుండేదాన్నేమో. లేదా ఆ మంచితనం భరించలేక అతన్ని శపించి అయినా నాదారి నేను చూసుకుని వుండేదాన్ని. యింత బతుకు బతికి యిన్నేళ్ల పురాణాలు చరిత్ర తర్వాత మా జీవితాలు యిలా నల్లకోటులో యిరుక్కుపోయాయి. మాకు సంతోషాన్నిచ్చేవి మీకు న్యాయంగా తోచదు.

'మీరు అతనితోనే వుండాలి'

మీరంతా కావలిస్తే అతనినే సపోర్ట్ చేయండి. అతనితో కలిసి వుండండి. కాని నన్ను మాత్రం అతనితో కలిసి వుండమనకండి. అంత అభివృద్ధిని స్వీకరించే శక్తి పుప్పొడిని వానతుంపర్లని చూసి సవ్వడి చేసే నావెర్రి చిన్ని మనసుకి. లేదు నన్ను వదిలైయండి.

'కుదర్దు మీరు అతనితోనే వుండాలి' ఆజ్ఞాపించింది నల్లకోటు.

'నేనుండలేను. నాలో మనిషి యింకా జీవించేవుంది. మానవీయ లక్షణాలు నాలో యింకా వున్నాయి. అవి నాలో వున్నంత కాలం నేనతనితో కలిసి దగ్గరగా వుండలేను. అవి చచ్చిపోయిన రోజు అతనితో వుండగలను వుంటాను యిప్పటికి నన్ను వదిలేయండి'.

'మానవీయ లక్షణాలు వున్నాయిగా. వుండు. సహనం చూపించు' అంది నల్లకోటు.

'నాలోని మానవీయతకు సహనం దయా లేనట్టున్నాయి. అతన్ని బాగ తన్నాలని కానీ యిలా ప్రవర్తించలేనంతగా అతన్ని బాగుచేయాలని కానీ అనిపించటం లేదు. అతన్ని భరించేవాళ్లకి అతన్ని వదిలేసి నాదారి నే చూసుకోవాలనుకుంటున్నాను'.

'కుదర్దు కుదర్దు వెళ్ళు వెళ్ళు. అతనితోనే వెళ్ళు అతనితోనే వుండు. అతనిని అతని సహచరులని భరించు వెళ్ళు...వెళ్లు...' అంటుంది నల్లకోటు.

తెలివిరావటం లేదు. లేవాలి... లేవాలి దిగ్గున లేచి కూర్చున్నాను. చేతిని చాపి లైట్ వేసాను. టైమ్ చూసాను.

రాత్రి రెండైయింది.

కర్టెన్ పక్కకి లాగి పక్కగది వైపు చూసాను. తలుపులు వేసున్నాయి.

వెక్కెక్కి యేడ్చాను. అలా యేడుస్తునే వున్నాను.

రాత్రులన్నీ యిలానే జరిగిపోతున్నాయి.

తేల్చుకోవాలి. యేదో వొకటి తేల్చుకోవాలి. లేకపోతే వో వంక కలలు కన్నీళ్ళు... మరో వంక మూసిన తలుపుల అభివృద్ధి సాగిపోతునే వుంటుంది.

తేల్చుకో...

ఫోన్ దగ్గరకి వెళ్లినెంబర్ డయిల్ చేసాను.

నిద్రమత్తులోంచి అటువైపు మగగొంతు.

'తను వుందా'

'ఆ'

అతను ఆమెని నిద్రలేపుతున్నాడు.

'హలో' అందామె.

'డైవర్స్ తీసుకోవాలి. నువ్వే నా లాయర్‌వి' స్థిరంగా స్పష్టంగా చెప్పాను.

రిసీవర్ క్రెడిల్ చేసి తీసిన కర్టెన్‌లోంచి బయటకి చూసాను.

చీకటి!

యిప్పుడా చీకటి నన్ను భయపెట్టటం లేదు.

నిద్రపడితే బాగుణ్ణు...

కలలొస్తాయి కదా...

సంతోషాన్నిచ్చేవి బెంగనిచ్చేవి

అంతే కాని అతని కలలు కాదు.

* * *

నిన్న రాత్రి వో కల వచ్చింది.

తేయాకు తోటల్లో రంగురంగు పావడాలు కట్టుకొన్న స్త్రీల గుంపుతో కలిసి ఆడుతూ పాడుతూనే తేయాకుని బుట్టల్లో నింపుతున్నానంట...

❖